
సాక్షి
ఒడిశా


గురువారం । 30 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ. 3,14,642
బంగారం 500 మిల్లీ గ్రాములు
వెండి 67 గ్రాముల 300 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



అక్రమార్కుల గుట్టురట్టు

నిబంధనల ఉల్లంఘనకు పాల్పడి రియల్ ఎస్టేట్ దందాకు పాల్పడిన అక్రమార్కుల గుట్టు రట్టయ్యింది.

-8లో



హమ్మయ్య..!

ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తర కాశీ జిల్లాలో కుప్పకూలిన సొరంగంలో చిక్కుకున్న 5 మంది ఒడియా కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు.

-8లో

ఉత్సవానికి వేళాయె..!

డిసెంబర్ 15 నుంచి మాల్యావంత్ ఉత్సవాలు ● పవిత్ర జలాలతో ప్రత్యేక పూజలు ప్రారంభం



మాల్యావంత్ పూజలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

గిరిజనుల్లో చైతన్యం కల్పించడమే ధ్యేయంగా 2003 నుంచి నిర్వహిస్తున్న మాల్యావంత్ మహోత్సవాలు డిసెంబర్ 15వ తేదీ నుంచి మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో జరగనున్నాయి. ఈ మేరకు ఉత్సవాలను పురస్కరించుకొని పద్మగిరి పంచాయతీలోని జోదుగూడ నది నుంచి పవిత్ర జలం తీసుకొచ్చి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్ విశాల్ సింగ్, ఎస్పీ నితీష్ వాద్వానీలు పవిత్ర జలంను భైరవీ మందిరం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారి ఆలయం నుంచి కలశ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన థింసా, కోయ, బోండ గిరిజన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి, చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, సబ్ కలెక్టర్ అక్షయ కుమార్ ఖేముండు, మల్కన్‌గిరి అభివృద్ధి పరిషత్ అధ్యక్షుడు అడ్మార్వా, డీఐపీఆర్వో ప్రమిళ మాఝి తదితరులు పాల్గొన్నారు.

- మల్కన్‌గిరి



కలశం మోసుకెళ్తున్న బీడీవో ప్రభాతి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సోమారీ టాంగులు



కలశ యాత్రను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ అక్షయ్ కుమార్ ఖేముండు



థింసా నృత్యం చేస్తున్న గిరిజన మహిళలు



పూజా కార్యక్రమాలు పరిశీలిస్తున్న అధికారులు

న్యూస్‌రీల్

సత్తాచాటిన సాయిరామ్



స్వర్ణ పతాకంతో సాయిరామ్

బరంపురం: బొలంగీర్‌లో మంగళవారం జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో హింజిలికాట్‌కు చెందిన సాయిరామ్ సత్తాచాటాడు. పోటీల్లో భాగంగా 40 కిలోల కేటగిరిలో స్వర్ణ పతకం సాధించాడు. దీంతో ఆయనకు జిల్లా క్రీడా సంఘం కార్యదర్శి అశోక్ కుమార్ సాహుతో పాటు పలువురు అభినందనలు తెలియజేశారు.

అన్నపై బాణంతో తమ్ముడు దాడి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దూల్ల మద్కమి

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి నలగుంటి పంచాయతీ మరిగూడ గ్రామంలో అన్నదమ్ముల మధ్య భూమికోసం జరిగిన తగాదాలో అన్నపై తమ్ముడు బాణంతో దాడిచేయడం కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. దూల్ల మాడ్కమి, ఆయన తమ్ముడు భీమ మద్కమిలు భూమి కోసం తరుచుగా గొడవలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం ఇంటి నుంచి పొలానికి వెళ్లారు. అయితే మార్గమధ్యలో అన్నను కలిసిన తమ్ముడు తనకు భూమి ఇవ్వాలని గొడవ చేశాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. దీంతో కోపంతో తమ్ముడు భీమ అన్న కడుపులో ఒక బాణం, బొడ్డు కింద మరో బాణం వేశాడు. దీంతో దూల్ల కేకలు వేయగా చుట్టుపక్కల వారు వెంటనే వచ్చి కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మల్కన్‌గిరి తరలించారు. విషయం తెలిసిన కలిమెల పోలీసులు భీమ కోసం గాలిస్తున్నారు.

అంబులెన్స్ వితరణ



అంబులెన్స్ ప్రారంభిస్తున్న సూర్యప్రకాష్

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి సుంగేరు పంచాయతీలో గల సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్)కి కాసీపూర్ మైత్రీ ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అంబులెన్స్ వితరణ చేసింది. బుధవారం జరిగిన ఈ కార్యక్రమానికి కాసీపూర్ పోలీసుస్టేషన్ ఐఐసీ సూర్యప్రకాష్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై అంబులెన్స్‌ను సీహెచ్‌సీ అధికారి డాక్టర్ అజిత్ మాఝికి అందించారు. ఈ ప్రాంతంలో రోగులకు మరిన్ని ఆరోగ్య సేవలు మెరుగవ్వడంతో పాటు సకాలంలో అంబులెన్స్ సేవలు అందుతాయని సూర్యప్రకాష్ అన్నారు. మైత్రీ సంస్థ ఇదివరకు కాసీపూర్ సమితిలో ఎన్నో సంక్షేమ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండంతో పాటు పేదల పాలిట ఆశాదీప్వంగా మారిందని, అందుకు సంస్థ యజమానికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో మైత్రీ సంస్థకు చెందిన సీహెచ్ బోసబాబు, సమితి వైస్ చైర్మన్ కున్ని కుమారి నాయక్, సుంగేర్ సర్పంచ్ ప్రమిలా దేయి మాఝి, మైత్రీ సంస్థ పీఆర్వో వృష్టి దురువా తదితరులు పాల్గొన్నారు.

జయపురం: సమితిలోని బొడొజివుని ప్రాథమిక వైద్య కేంద్రానికి నూతన 108 అంబులెన్స్‌ను జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని 5 గ్రామ పంచాయతీల రోగులకు వైద్య కేంద్రంతో సేవలు అందుతున్నాయన్నారు. ఇప్పుడు ఆయా గ్రామాల ప్రజలకు అంబులెన్స్ సేవలు అందుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన వైద్యాధికారి డాక్టర్ అరుణ కుమార్ పాడీ, జిల్లాకేంద్ర ఆస్పత్రి అధికారి డాక్టర్ రవీంద్ర నాథ్ మిశ్ర, రామనగుడ కమ్యూనిటీ ఆస్పత్రి అధికారి డాక్టర్ మనోలిష నాయిక్, జిల్లా కేంద్ర ఆస్పత్రి మేనేజర్ తదాగత దాస్ తదితరులు పాల్గొన్నారు.

వికాసం పేరుతో వినాశనం

- బీజేడీ హయాంలో అంతా అవినీతిమయం
- మాజీ డిప్యూటీ స్పీకర్ రామచంద్ర పండా



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీజేపీ శ్రేణులు

బరంపురం: రాష్ట్రంలో వికాసం పేరుతో బీజేడీ ప్రభుత్వం వినాశనం చేస్తోందని బీజేపీ జాతీయ కృష్యక్ మోర్చా ఉపాధ్యక్షుడు మరియు రాష్ట్ర మాజీ డిప్యూటీ స్పీకర్ రామచంద్ర పండా అన్నారు. ఈ మేరకు స్థానిక బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట గంజాం జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. హిల్‌పట్నా రోడ్‌లోని గణేష్ ఆలయ ప్రాంగణం నుంచి వందలాది మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సుభాష్ సాహు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేడీ పాలన అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధి పేరుతో కొంతమంది అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో విదేశీ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ ఆదివాసీ, పేదల భూములు దోచుకుంటోందని చెప్పారు.

చిట్‌ఫండ్ చీటింగ్‌తో సంబంధం

బిజయ్ కుమార్ స్వాయి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇటీవల జరిగిన చిట్‌ఫండ్ చీటింగ్ అవినీతిలో పలువురు రాష్ట్ర మంత్రులకు సంబంధం ఉందని ధ్వజమెత్తారు. కానీ వారికి సీఎం నవీన్ పట్నాయక్ ఆశ్రయం కల్పిస్తూ రక్షిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర మహిళా యువ మోర్చా అధ్యక్షురాలు జయంతి పాడియారి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా జాతికి రక్షణ కరువైందని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ చూసినా రోజురోజుకీ మహిళల హత్యలు, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, వరకట్న, గృహ హింసలు ఎక్కువయ్యాని చెప్పారు. జిల్లా యువమోర్చా అధ్యక్షుడు సునీల్ కుమార్ సాహు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువయ్యాయన్నారు. శాంతి భద్రతలు క్షీణించాయని, ప్రజలు భయాందోళనతో గడుపుతున్నారని దుయ్యబట్టిపోశారు. ప్రజలకు రక్షణ కల్పించడంతో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అనంతరం గవర్నర్‌కు ఉద్దేశిస్తూ వినతిపత్రం కమిషనర్‌కు అందించారు. ఆందోళనలో కృష్యక్ మోర్చా అధ్యక్షుడు రామ పాత్రో, భవానీ శంకర్ దాస్, ప్రభాత్, ఎన్. రాజేంద్ర కుమార్, గోపీనాథ్ పాఢీ, రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షుడు శరత్‌కుమార్ సాహు, మహేశ్వర్ సెఠి, గిరిధర్ పాఢీ, దొండపాణి ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి పట్టివేత



డ్రైవర్ ధర్మేంద్ర ఖాతర్

జయపురం: కొరాపుట్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బందపూర్ సబ్ డివిజనల్ పోలీసు అధికారి సంజయ కుమార్ మహాపాత్రో నేతృత్వంలో మాచ్‌ఖండ్, లమతాపుట్, పాడువ నందపూర్ ప్రాంతాల్లో గంజాయిపై ఉక్కుపాదం మోపేందుకు ఆపరేషన్ గ్రీన్ అభిజాన్ నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అనేక ఎకరాల్లో గంజాయి పంటలను ధ్వంసం చేస్తున్నారు. కాగా ఆపరేషన్ గ్రీన్ అభిజాన్‌లో భాగంగా మంగళవారం రాత్రి నందపూర్ పోలీసు అధికారి ఆశ్రిత ఖలోక నేతృత్వంలో సబ్ ఇన్‌స్పెక్టర్ బేదబర సాహు ఇతర పోలీసు సిబ్బంది నందపూర్ డాక్‌బంగ్లా కూడలి వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో నంబర్ లేని ఒక ట్రాక్టర్‌ను అనుమానించి పోలీసులు అడ్డగించారు. అనంతరం ట్రాక్టర్‌లో తనిఖీలు నిర్వహించగా గంజాయి పట్టుబడింది. దీంతో గంజాయి, ట్రాక్టర్‌ను సీజ్‌చేసి, డ్రైవర్‌ను అరెస్టు చేశారు. గంజాయి తూకం వేయగా 128 కేజీలు ఉన్నట్లు వెల్లడైంది. మాచ్‌ఖండ్ నుంచి సెమిలిగుడకు గంజాయి తరలిస్తున్నట్లు ట్రాక్టర్ డ్రైవర్ ధర్మేంద్ర ఖాదర్ వెల్లడించారు. కేసును దర్యాప్తు చేసే బాధ్యతను ఎస్ఐ దీప్తిమయి దారువకు అప్పగించినట్లు నందపూర్ సబ్ డివిజనల్ పోలీసు అధికారి సంజయ కుమార్ మహాపాత్ర వెల్లడించారు.



పట్టుబడిన గంజాయి

కోళ్ల పెంపకంతో మహిళలకు ఉపాధి

- సెంచూరియన్ వర్సిటీ వెటర్నరీ డీన్ రాజకిషోర్ స్వయిని
- కొనసాగుతున్న వ్యవసాయ పనిముట్ల మేళా



మాట్లాడుతున్న డీన్ రాజకిషోర్ స్వయిని



పవర్ టిల్లర్లు, సాగునీటి పంపు మోటార్ల పనితీరు తెలుసుకుంటున్న మహిళా సంఘాల సభ్యులు



గొప్పుతీసే యంత్రం పనితీరును వివరిస్తున్న స్టాల్ అధికారి



మినీ ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు

పర్లాకిమిడి: పాల్లీ సేవా కేంద్రంలో జాతి కోళ్లను పెంచడం వలన గ్రామీణ యువత, మహిళా గ్రూపులు ఉపాధి పొందవచ్చని సెంచూరియన్ వర్సిటీ వెటర్నరీ శాఖ డీన్ రాజకిషోర్ స్వయిని అన్నారు. స్థానిక గజపతి స్టేడియంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వ్యవసాయ యంత్రాలు, పనిముట్ల మేళా రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి మహిళలు, స్వయం సహాయక గ్రూపులు, యువకులకు పశు పాలనతో పాటు పశుగ్రాసం, జాతికోళ్లు, గొర్రెలు, మేకలను ఫారం హౌస్‌గా ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందవచ్చన్నారు. సెంచూరియన్ వర్సిటీలో పశు చికిత్స కేంద్రం, కోళ్లు, మేకలను అనేక రోగాల నుంచి కాపాడేందుకు చికిత్స కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గేదెలు, ఆవులు పెంచిన పాడి రైతులు బయోగ్యాస్ ప్లాంటు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇస్తుందన్నారు.

సబ్సిడీపై యంత్రాలు

మేళాలో పంపుసెట్లు, టిల్లర్లు, విత్తనాలు, గోప్పు తీసే యంత్రాల కొనుగోలుపై 40 నుంచి 50 శాతం వరకూ ప్రభుత్వం సబ్సిడీలు అందిస్తోందని డీన్ రాజకిషోర్ స్వయిని తెలియజేశారు. జిల్లాలో 8 వేల స్వయం సహాయక గ్రూపులు ఉన్నాయని, వారికి అందుబాటులో అనేక వ్యవసాయ పనిముట్లు, మినీ ట్రాక్టర్లు, పిచికారీ యంత్రాలు కొనుగోళ్లకు 25 శాతం డిపాజిట్ చేస్తే చాలని, మిగతా డబ్బులు ప్రభుత్వమే రాయితీ రూపంలో వారి బ్యాంకు ఖాతాలో పడతాయని గుసాని బ్లాక్ వ్యవసాయ విస్తరాణాధికారి శిశిర్ కుమార్ బిశోయి అన్నారు. అనంతరం మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో వ్యవసాయ యంత్రాలు, పనిముట్ల మేళాకు విచ్చేసి వివిధ వ్యవసాయ యంత్రాల స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ మేళా మరో రెండు రోజులు రైతులకు, మిషన్ శక్తి గ్రూపులకు అందుబాటులో ఉంటుందని జిల్లా ముఖ్య వ్యవసాయాధికారి ఇరేనియస్ ప్రధాన్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా కృషి అధికారి ఎ.రామ్‌ప్రసాద్ పాత్రో, గుసాని సమితి వ్యవసాయ అధికారి శిశిరోకుమార్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న జెన్న మృతదేహం

రాయగడ: జిల్లాలో కాసీపూర్ సమితి టికిరి సమీపంలోని హనుమాన్ మందిరం కొండపై ఒక యువకుడి మృతదేహన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతుడు ఖగేశ్వర్ జెన్న (45)గా గుర్తించారు. టికిరిలోని ఉత్కళ అలూమిన కర్మాగారంలో ఒక గుత్తేదారుని వద్ద ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు ఐఐసీ విశ్వబిందన్ బాగ్ తెలియజేశారు. హనుమాన్ మందిరానికి సమీపంలో గల ఒక చెట్టుకు తువ్వాలు సాయంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తమ ప్రాథమిక దర్యాప్తులో తేలిందని వివరించారు. కాగా మృతుడు భద్రక్ జిల్లాలోని సిములియా పోలీసుస్టేషన్ పరిధి విష్ణుపూర్ గ్రామానికి చెందినవాడిగా వెల్లడించారు. ఉపాధి కోసం ఇక్కడకు వచ్చి టికిరిలో ఒక అద్దె ఇంట్లో నివాసముంటున్నట్లు పేర్కొన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియడం లేదని, మృతదేహన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు తెలియజేశారు.

క్లుప్తంగా

జాతీయ స్కేటింగ్ పోటీలకు యశ్వంత్



జాతీయ పోటీలకు ఎంపికైన యశ్వంత్

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన స్కేటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విజయనగరానికి చెందిన తాళాబత్తుల యశ్వంత్ జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఇటీవల విశాఖలోని ఉడాపార్కులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని వివిధ విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించి వచ్చే నెల 14 నుంచి 21వ తేదీ వరకు చెన్నైలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా యశ్వంత్‌ను కోచ్‌లు బద్రీనాథ్, రాజు అభినందించారు.

జాతీయ కబడ్డీ పోటీలకు గోవిందపురం విద్యార్థి



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం శైలజారాణి తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని గోవిందపురం జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల చిత్తూరు జిల్లా చౌడేపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలలో పాఠశాలకు చెందిన పి.దిలీప్ ప్రథమస్థానంలో నిలిచాడు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో రాష్ట్రం తరఫున ఆడనున్నాడు. తమ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడంతో హెచ్‌ఎం బి. శైలజారాణితో పాటు ఉపాధ్యాయులు ఆ విద్యార్థిని అభినందించారు.

చెట్టెక్కి పడి వ్యక్తి మృతి



వలరౌతు మోహనరావు (ఫైల్)

భామిని: మండలంలోని దిమ్మిడిజోలకు చెందిన వలరౌతు మోహనరావు(46) మంగళవారం రాత్రి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈనెల19వ తేదీన ఏకాదశి సందర్భంగా వలరౌతు మోహనరావు కొబ్బరిచెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో కొత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరంవైద్యుల సిఫారసు మేరకు విశాఖ కేజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడికి భార్య ధనలక్ష్మి, ఇద్దరు కుమారులున్నారు. మృతుని కుటుంబాన్ని సర్పంచ్ వలరౌతు రజిని, వైఎస్సార్‌సీపీ నాయకుడు వలరౌతు రామారావు, వి.సింహాద్రి పరామర్శించి ఓదార్చారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



మృతిచెందిన వెంకటలక్ష్మి (ఫైల్)

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని గవరవీధిలో ఈ నెల 19వ తేదీన గ్యాస్ లీకై ఇల్లు పేలిపోయి ఇద్దరు మహిళలతో పాటు ముగ్గురు చిన్నారులు తీవ్రంగా కాలిపోయిన ఘటనలో తామరాపల్లి వెంకటలక్ష్మి(50) బుధవారం తెల్లవారు జామున మృతి చెందింది. ఈ మేరకు ఏఎస్సై సత్యం తెలిపారు. బాధితులంతా ప్రస్తుతం విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు కాపుశంభాం విద్యార్థిని



జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పావనిని అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీలు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కాపుశంభాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పప్పల పావని జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది.ఈ నెల 24 నుంచి 26 వరకు చిత్తూరు జిల్లాలోని చౌడప్పల్ ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ అండర్-17 విభాగం కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.వచ్చే నెలలో రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరగనున్న ఆలిండియా స్కూల్‌గేమ్స్ టోర్నీలో రాష్ట్రం తరఫున కబడ్డీ పోటీల్లో ఆమె ప్రాతినిధ్యం వహించనుంది. జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన పావనిని ప్రధానోపాధ్యాయుడు, డి.రాము, వ్యాయామ ఉపాధ్యాయుడు ఉదయ్‌కుమార్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

అక్రమార్కుల గుట్టురట్టు

- నిబంధనలకు విరుద్ధంగా రియల్ ఎస్టేట్ దందా
- ఘాటుగా స్పందించిన ఒరేరా
- సబ్ రిజిస్ట్రార్‌కు వ్యతిరేకంగా చర్యలకు సిఫారసు



భువనేశ్వర్: నిబంధనల ఉల్లంఘనకు పాల్పడి రియల్ ఎస్టేట్ దందాకు పాల్పడిన అక్రమార్కుల గుట్టు రట్టయ్యింది. ఈ చర్యలపై ఒడిశా రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఒరేరా) ఘాటుగా స్పందించింది. వ్యవహారంలో పాలుపంచుకున్న సబ్ రిజిస్ట్రార్, అనుబంధ అధికార వర్గాలకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టాలని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్‌కు సిఫారసు చేసింది. ఒడిశా రియల్ ఎస్టేట్ (రెగ్యులేషన్ అండ్ డవలప్‌మెంట్) యాక్ట్-2016 నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలపై భువనేశ్వర్ సమీపంలో జరిగిన ల్యాండ్ డీల్‌ను ఒడిశా రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఒరేరా) రద్దు చేసింది. రాజధాని నగరం శివారు బలియంత ప్రాంతంలో ఒక ఎకరం విస్తీర్ణపు భూమిని యజమాని నిబంధనల మేరకు ఎటువంటి ముందస్తు అనుమతి, మంజూరు లేకుండా సుమారు 20 సబ్ ప్లాటులుగా విభజించి, బహుళ కొనుగోలుదారులకు విక్రయించడం నేరంగా ఒరెరా నిర్ధారించింది. ఈ ప్రక్రియకు ముందు ఒరెరాలో నమోదు చేయడం తప్పనిరి. 500 చదరపు మీటర్ల కంటే అధిక విస్తీర్ణపు స్థలం లావాదేవీల వ్యవహారాల్లో ఒరేరాలో నమోదు కావడం అనివార్యం. ఈ నమోదు జరగకుండా స్థల విక్రయం లావాదేవీలు నిర్వహించడం నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఒరెరా నమోదు లేకుండా ఏ ప్రమోటర్‌కు ప్రకటనలు ఇవ్వడానికి, మార్కెటింగ్ చేయడానికి, బుక్ చేయడానికి, విక్రయించడానికి లేదా కొనుగోలుకు ప్రోత్సహించడం లేదా ఏదైనా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులో ప్లాట్, అపార్ట్‌మెంట్ లేదా బిల్డింగ్ లేదా దానిలో కొంత భాగాన్ని కొనుగోలు చేయడానికి వ్యక్తులను ఆహ్వానించడానికి అనుమతి లేదు.

పరిమితుల అతిక్రమణ

భూస్వామి ఒరేరా నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా, 1972 నాటి ఒరిస్సా కన్సాలిడేషన్ ఆఫ్ హోల్డింగ్స్ మరియు ప్రివెన్షన్ ఆఫ్ ఫ్రాగ్మెంటేషన్ ఆఫ్ ల్యాండ్ యాక్ట్ కింద పరిమితులను అతిక్రమించి సువిశాల భూమిని (చొక్కా) సబ్-ప్లాట్ చేసి విక్రయించడం అక్రమంగా ఒరెరా ధ్రువీకరించింది. భూస్వామి అక్రమాలకు ఖుర్దా జిల్లా బలొకట్టి నువాపట్న గ్రామస్తుడు దేబొరాజ్ మహాపాత్రో బలయ్యాడు. ఈ విషయం ఒరెరా దృష్టికి తీసుకుని వెళ్లడంతో అక్రమాలు నిర్ధారించబడ్డాయి. 2021 సంవత్సరంలో బలియంత తహసీల్ ప్రతాప్ శాసన్ ప్రాంతంలో బంశీధర్ సాహు నుంచి 2 వేల చదరపు అడుగుల విస్తీర్ణపు స్థలం కొనుగోలు చేశాడు. అనంతరం ఈ స్థలంలో ఇల్లు కట్టేందుకు రుణ సౌకర్యం కోసం సంప్రదించడంతో అక్రమాలు వెలుగు చూశాయి. ఈ భూమి కొనుగోలు ఒరెరా నిబంధనలకు వ్యతిరేకంగా జరిగినట్లు బ్యాంకు రుణ మంజూరు వర్గాలు వేలెత్తి చూపాయి. దీంతో ఒరెరా ఈ వ్యవహారంలో చొరవ కల్పించుకుని చేపట్టిన విచారణలో గుట్టు బయటపడింది. ఈ నేపథ్యంలో స్థలాల విక్రయం చెల్లదని ఒరెరా తేల్చి చెప్పడంతో విక్రయ ఒప్పందం రద్దు చేసినట్లు తీర్మానించింది. ఈ క్రమంలో 11 ప్లాట్ల కొనుగోలు నిర్వీర్యమైంది. ఈ ప్లాట్ల విక్రయ ఒప్పందం చెల్లదని ఒరెరా ప్రకటించింది.

2 నెలల గడువు

అక్రమ విక్రయాలు, స్థల విభజన కార్యకలాపాల సవరణకు ఒరెరా 2వ నెలల గడువు విధించింది. విక్రేత బొంశీధర సాహు ఈ గడువులోగా ప్రతిపాదిత స్థలాల విభజనకు సంబంధించి సమగ్ర ప్రణాళిక (లే అవుట్) సిద్ధం చేయాలి. ఈ ప్రక్రియ ముగిసిన 45 రోజుల వ్యవధిలో కొనుగోలు రిజిస్ట్రేషను ప్రక్రియ ముగించాలని ఆదేశించింది. దీనికి సంబంధిత ఖర్చులు అక్రమాలకు పాల్పడిన విక్రేత భరించాలని ఒరెరా స్పష్టం చేసింది.

అక్రమ రిజిస్ట్రేషన్లు నివారించాలి

స్థలాల అక్రమ విభజన, విక్రయాలు వగైరా లావాదేవీల రిజిస్ట్రేషన్లు నివారించాలని జిల్లా కలెక్టర్లకు ఒరెరా ఆదేశించింది. అలాగే బలియంత స్థలం విక్రయం వ్యవహారంలో అప్పటి సబ్ రిజిస్ట్రార్ వ్యతిరేకంగా చర్యలు చేపట్టేందుకు ఆదేశించింది. ఆయనతో పాటు తోటి అధికారులు, సిబ్బందికి వ్యతిరేకంగా విచారణ చేపట్టి తగిన రీతిలో చర్యలు ఖరారు చేయాలని ఆదేశాల్లో పేర్కొంది.

అలెర్ట్..!

- రాష్ట్రంలోని 7 జిల్లాలకు తుఫాన్ హెచ్చరికలు
- అప్రమత్తంగా ఉండాలని సూచన

భువనేశ్వర్: బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడడంతో రాష్ట్ర ప్రభుత్వం ఏడు తీర ప్రాంత జిల్లాలను అప్రమత్తం చేసింది. బాలాసోర్, భద్రక్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, పూరీ, ఖుర్దా మరియు గంజాం జిల్లాల కలెక్టర్లకు లేఖలు రాసింది. ఆగ్నేయ బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న దక్షిణ అండమాన్ సముద్రం అల్పపీడన ప్రాంతంలో తీవ్ర తుఫాన్‌గా మారనుంది. భారత వాతావరణ శాఖ సూచన మేరకు ప్రత్యేక సహాయ కమిషనర్ (ఎస్ఆర్‌సీ) సత్యబ్రత సాహూ జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ అంచనా ప్రకారం డిసెంబర్ 1వ తేదీ నుంచి మధ్య బంగాళాఖాతంలో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో గాలులు వీస్తాయి. మర్నాడు డిసెంబర్ 2న గాలుల వేగం 50 నుంచి 60 కి.మీ.కు పెరగవచ్చు. సముద్రంలో అలజడి పరిస్థితులు తాండవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో డిసెంబర్ 1 ఉదయం నుంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని ముందస్తు హెచ్చరిక జారీ అయింది. ఇప్పటికే సముద్రంలోకి వెళ్లినవారు ఆ తేదీలోపు తిరిగి రావాలని మత్స్య మరియు జంతు వనరుల శాఖకు ఎస్ఆర్‌సీ లేఖ రాశారు.

భారీ వర్ష సూచన

సముద్రంలో బలం పుంజుకుంటున్న తుఫాన్ వాతావరణం నేపథ్యంలో భారీ వర్ష సూచనలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో పొలాల్లో వరిచేను మరియు ఇతర పంటల రక్షణ కోసం చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖకు తెలిపారు. డిసెంబర్ 3వ తేదీ నుంచి 5 వరకు కోస్తా, దక్షిణ ఒడిశా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. డిసెంబర్ 5వ తేదీ నాటికి ఈ వ్యవస్థ ఉత్తర ఆంధ్రప్రదేశ్, ఒడిశా తీరాలను దాటవచ్చని వాతావరణ నమూనాలు అంచనా వేశాయి. ఈనెల 30వ తేదీ నాటికి తుపాను ముఖచిత్రం స్పష్టమవుతుందని భావిస్తున్నట్లు స్థానిక వాతావరణ కేంద్రం డైరెక్టర్ హెచ్.ఆర్.బిస్వాస్ తెలిపారు. అంచనా ప్రకారం డిసెంబర్ 2 నాటికి తుఫాన్‌గా మారే అవకాశం ఉందన్నారు. తుఫానుగా మారితే దానిని మయన్మార్ సూచించిన మైచాంగ్ అని పిలుస్తారు. ఈ సంవత్సరం హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఆరవ, బంగాళాఖాతంలో నాల్గో తుఫానుగా పరిగణించబడుతుంది. ఈనెల 30న అండమాన్ దీవుల మీదుగా చాలా చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఒడిశా తీర ప్రాంతంలోని అనేక ప్రదేశాల్లో ఈనెల 29, 30 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

పంటల రక్షణ తప్పనిసరి

అల్పపీడనం ప్రభావంతో పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ ఐఎండీ అంచనా వేసింది. ఈ నేపథ్యంలో రైతులు తాము పండించిన పంటలను సురక్షిత ప్రదేశాల్లో భద్రపరచాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సాధికారత శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ అరబింద పాఢి తెలిపారు. రాష్ట్రంలో చాలా చోట్ల వరి పంటలు పండాయి. కోతలు దాదాపు పూర్తి అయ్యాయి. కొన్ని చోట్ల కోతలు కొనసాగుతున్నాయి. పంటలు సురక్షిత ప్రాంతాలకు తరలించి రైతాంగం భద్రపరచాలన్నారు. ఎటువంటి ఘటననైనా ఎదుర్కోవడానికి విభాగం యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. అలాగే బంగాళదుంపల సాగు సమయాన్ని మార్చుకోవాలని వ్యవసాయ, రైతు సాధికారిత శాఖ ప్రధాన కార్యదర్శి అనుబంధ రైతులకు సూచించారు. ఈ ఏడాది 22 లక్షల మంది రైతులు పంటల బీమా యోజనలో చేరారు. జిల్లాల నుంచి క్షేత్రస్థాయి నివేదికలు అందడంతో కరువు పరిస్థితులపై శాఖ చర్యలు చేపడుతుంది. ఎక్కడైనా పంట నష్టం జరిగితే బీమా పథకంలో నమోదు అయిన రైతాంగానికి సముచిత పరిహారం అందుతుందని తెలియజేశారు. ఐఎండీ సమాచారం ప్రకారం అండమాన్ సముద్రం మీద అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో మల్కన్‌గిరి, కొరాపుట్, గజపతి, రాయగడ, నవరంగ్‌పూర్, కంధమల్‌తో సహా దక్షిణ ఒడిశాలోని అనేక ప్రాంతాల్లో డిసెంబర్ 5 నుండి వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

ఆదర్శనీయుడు రఘునాథ్ పట్నాయక్



రఘునాథ్ పట్నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాహిణీపతి



కాంగ్రెస్ భవన్‌లో మాట్లాడుతున్న బినోద్ మహాపాత్రో

జయపురం: దివంగత ప్రజా నాయకుడు రఘునాథ్ పట్నాయక్ ఆదర్శనీయుడని వక్తలు కొనియాడారు. స్థానిక జ్యోతి కల్యాణ మండపంలో రఘునాథ్ పట్నాయక్ 95వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి మాట్లాడుతూ.. రఘునాథ్ పట్నాయక్ మూడు దశాబ్దాలకు పైగా మంత్రిగా, ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించారన్నారు. ఆయన జయపురంలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పేరున్న నేతని తెలియజేశారు. రాష్ట్రానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. కార్యక్రమంలో జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, సీనియర్ కాంగ్రెస్ నేత బినోద్ మహాపాత్రో, ప్రశాంత మిశ్ర, మహ్మద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మదన్ మోహన్ నాయక్, రఘునాథ్ పట్నాయక్ కుమారుడు బిరెన్ మోహన్ పట్నాయక్, సంగీత కళాకారుడు ధిరెన్ పట్నాయక్ తదితరులు నివాళులర్పించారు. అదేవిధంగా జిల్లా కాంగ్రెస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బినోద్ మహాపాత్రో, మాజీ ఎమ్మెల్యే నిమయిచరణ్ సర్కార్, వెంకటరావు పట్నాయక్, కాంత పాఢీ, జిల్లా మైనారిటీ కాంగ్రెస్ సెల్ అధ్యక్షుడు హసన్ మదాని తదితరులు రఘునాథ్ పట్నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

పాత నోట్లు, నాణేల మార్పిడి మేళ

- ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్ శారద ప్రసన్న మహంతి



శారదా ప్రసన్న మహంతి

భువనేశ్వర్: రాష్ట్రంలో పాత నోట్లు, నాణేల మార్పిడి మేళ నిర్వహించనున్నారు. పలుచోట్ల 50 పైసలు నుంచి రూ.20 వరకు విలువ కలిగిన నాణేలు మరియు నోట్లు స్వీకరించడానికి వ్యాపారులు నిరాకరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినబడుతున్నాయి. ఈ నోట్లు, నాణేలు చెల్లుబాటు చట్టబద్ధమని ఆర్‌బీఐ ప్రాంతీయ డైరెక్టర్ శారద ప్రసన్న తెలిపారు. ఈ పరిస్థితుల్లో స్థానిక భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయం వీటి మార్పిడి కోసం ప్రత్యేక మేళా కార్యక్రమం చేపడుతున్నట్లు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 314 మండలాల్లో నాణేలు, చిరిగిన, దెబ్బతిన్న మరియు మాసిన నోట్లను మార్చుకునేందుకు మార్పిడి మేళా నిర్వహణ సంకల్పించినట్లు వెల్లడించారు. ప్రజలు ఈ నాణేలను బ్యాంకుల్లో కూడా డిపాజిట్ చేయవచ్చన్నారు. ఏ బ్యాంకు కూడా తమ ఖాతాదారుల నుంచి నాణేలను స్వీకరించడానికి నిరాకరించదని స్పష్టం చేశారు. అంగడి కూడలి ప్రాంతాల్లో పాత నాణేలు, నోట్ల మార్పిడి మేళాలు నిర్వహిస్తామని మహంతి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 314 మండలాల్లో 3 నెలల మార్పిడి కార్యక్రమం కింద డిసెంబర్ నెల మొదటి లేదా రెండో వారం నుంచి వివిధ బ్యాంకుల ఆధ్వర్యంలో మేళా ప్రారంభిస్తారు. 50 పైసల నుంచి రూ.20 వరకు ఉన్న అన్ని నాణేలు, నోట్లు చట్టబద్ధమైనవని, ఎవరైనా వాటిని ఖాతాదారుని బ్యాంక్ ఖాతాలో డిపాజిట్ చేయాలనుకుంటే బ్యాంకులు వీటిని స్వీకరించాల్సిందేనని స్పష్టం చేశారు.

ఐదు పూరిళ్లు దగ్ధం

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెంలో బుధవారం సాయంత్రం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఐదిళ్లు దగ్ధమైనట్లు గజపతినగరం అగ్నిమాపక అధికారి ఎంఎస్ రవిశంకర్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో అందరూ పొలాల్లో ఉండడంతో తిండి గింజలు, నగదు, బట్టలు బూడిద కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

హమ్మయ్య..!

- ఉత్తరాఖండ్‌లో సొరంగం నుంచి బయటపడిన ఒడిశా కార్మికులు
- పరామర్శించిన రాష్ట్ర కార్మిక మంత్రి శారదా ప్రసాద్ నాయక్





ఒడిశా కార్మికులను పరామర్శిస్తున్న మంత్రి శారదా ప్రసాద్ నాయక్



ప్రాణాలతో బయటపడిన ఒడిశా కార్మికులు

భువనేశ్వర్: ఉత్తరాఖండ్ రాష్ట్రం ఉత్తర కాశీ జిల్లాలో కుప్పకూలిన సొరంగంలో చిక్కుకున్న 5 మంది ఒడిశా కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక, ఈఎస్ఐ శాఖ మంత్రి శారదా ప్రసాద్ నాయక్ బుధవారం వారిని పరామర్శించారు. సొరంగంలో చిక్కుకుని ప్రాణాపాయ పరిస్థితుల నుంచి సురక్షితంగా బయటపడిన కార్మికులను చికిత్స కోసం ఉత్తర కాశీ చిన్యాలిసౌర్ ఆస్పత్రిలో చేర్చారు. గత కొన్ని రోజులుగా హిమాలయ రాష్ట్రంలో రాష్ట్ర కార్మికుల రాక కోసం నిరీక్షించిన మంత్రి వీరందర్ని ఆస్పత్రిలో కలిశారు. కార్మికులంతా క్షేమంగా ఉన్నారని మంత్రి తెలిపారు. రాష్ట్రానికి చెందిన 5 మంది కార్మికుల్లో మయూర్‌భంజ్ జిల్లాకు చెందిన రాజు నాయక్, ధీరేన్ నాయక్, బిశ్వేశ్వర్ నాయక్, నవరంగ్‌పూర్‌కు చెందిన భగవాన్ బాత్రా, భద్రక్ జిల్లాకు చెందిన తపన్ మండల్ ఉన్నారు.

ప్రమాద స్థలానికి ప్రత్యేక బృందం

ప్రమాద స్థలానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక బృందాన్ని, ప్రమాదంలో చిక్కుకున్న ఒడిశా కార్మికుల కుటుంబ సభ్యులను పంపింది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకు కార్మిక శాఖ అధికారులు అక్కడే మకాం వేశారు. చిక్కుకున్న కార్మికులకు నైతిక మద్దతు ఇవ్వడానికి ఒడిశా ప్రభుత్వం వారి కుటుంబ సభ్యులను ఉత్తర కాశీకి తీసుకెళ్లిందని రాష్ట్ర రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ మంత్రి సుదామ్ మరాండి తెలిపారు. కాగా 17 రోజుల నిరంతర శ్రమకు ఫలితంగా ఉత్తర కాశీలో కుప్పకూలిన సొరంగం నుంచి సురక్షితంగా బయటపడిన ఒడియా కార్మికుల కుటుంబాలు మరియు గ్రామాల్లో ఆనందం వెల్లివిరిసింది. కూలిపోయిన హిమాలయ రహదారి సొరంగం కింద కూరుకుపోయిన 41 మంది కార్మికులను 17 రోజుల నిరవధికంగా శ్రమించి జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్) మరియు ఆర్మీ సురక్షితంగా ప్రాణాలతో బయటకు తీసుకువచ్చారు.

సంతోషంగా ఉంది: సీఎం నవీన్ పట్నాయక్

కార్మికులను విజయవంతంగా బయటకు తీసుకురావడం ఎంతో సంతోషంగా ఉందని సీఎం నవీన్ పట్నాయక్ అన్నారు. సహాయక ప్రక్రియ విజయవంతం చేసినందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం, ఎన్డీఆర్ఎఫ్, డిఫెన్స్ బృందాలకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశం తన పౌరుల ప్రాణాలను కాపాడటానికి ఏదైనా చేయగలదని నిరూపితమైందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

రాయగడ: స్థానిక జంఝావతి వాకర్స్ మహిళా క్లబ్ నూతన కార్యవర్గం బుధవారం ఎన్నికైంది. లయన్స్ క్లబ్ సమావేశ మందిరంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో కొత్త కమిటీని ప్రకటించారు. క్లబ్ అధ్యక్షురాలిగా అరుణా బెహర, కార్యదర్శిగా రస్మిత పండ, కోశాధికారిగా పమితా పాడి, సహ కార్యదర్శిగా ఎస్.సుజాతలు నియమితులవ్వగా, ఉపాధ్యక్షులుగా సుజాత మదల, సేనాపతి లీనాలు ఎంపికయ్యారు. అదేవిధంగా రుబిరాణి కుందు, అనసూయా మాఝి, కల్పన పండ, రేణుబాల పాణిగ్రహి, ఉమాపాడి, సుగ్యాని పాడి, పద్మాలయ మిశ్రా, కృష్ణప్రియ సహాని, అర్చనా పట్నాయక్, బిజయలక్ష్మి మిశ్రాలు బోర్డు సభ్యులుగా, క్లబ్ ముఖ్య సలహాదారునిగా డాక్టర్ డీకే మహంతిలను ఎన్నుకున్నారు.

కొండచిలువ కలకలం



కొండచిలువను పట్టుకున్న అరవింద్

బరంపురం: స్థానిక కుకుడాఖండి బ్లాక్ పరిధి దక్షిణపుర గ్రామంలో 10 అడుగుల కొండచిలువ బుధవారం కలకలం సృష్టించింది. స్థానికుల సమాచారంతో స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థకు చెందిన పి.అరవింద్ దేశిబెహర చాకచక్యంతో కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం దిగపండి అటవీ విభాగం దగ్గరలో ఉన్న చందుడిదేవ్ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టా రు. దీంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జరాకి బంగారు పతకం



జరాను అభినందిస్తున్న ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు

విజయనగరం: జాతీయస్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఎస్.జరా ప్రతిభ కనబరిచింది. ఈనెల 22 నుంచి 26వ తేదీ వరకు బెంగళూరులో జరిగిన 28వ జాతీయ చాంపియన్‌షిప్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహించిన జరా బంగారు పతకం కైవసం చేసుకుని విజయనగరం కీర్తి ప్రతిష్టలను చాటి చెప్పింది. 69 కేజీల మహిళల విభాగంలో పాల్గొన్న జరా మొత్తం 90 కేజీల బరువు ఎత్తి ఈ ఘనత సాధించింది. బంగారు పతకాన్ని దక్కించుకున్న జరాను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు బుధవారం అభినందించారు.

మహిళ మృతిపై ఆందోళన

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆరోపణ
- దాడి చేశారంటూ పోలీసులకు వైద్యుల ఫిర్యాదు



మృతురాలి బంధువులకు సర్దిచెబుతున్న పోలీసులు

సాలూరు: సాలూరు పట్టణంలోని దాసరివీధికి చెందిన నీలాపు నాగమ్మ(49) ఆయాసంతో బాధపడుతుండంతో బంధువులు బుధవారం వేకువజామున 4.50 గంటల సమయంలో సాలూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్య సిబ్బంది ప్రాథమిక వైద్యసేవలు అందించారు. జనరల్ వార్డులో చేర్చారు. రౌండ్స్‌కు వచ్చిన వైద్యురాలు తిరుమలాదేవి జనరల్ వార్డులో ఉన్న నాగమ్మకు వైద్య పరీక్షలు చేశారు. మెరుగైన వైద్యంకోసం క్యాజువాలిటీ వార్డుకు మార్పుచేయాలని సూచించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందంటూ రౌండ్స్‌లో ఉన్న డాక్టర్ శాంతిప్రియకు 9 గంటల సమయంలో సమాచారం ఇచ్చారు. ఆమె వచ్చి వైద్యసేవలు అందించినా ఫలితం లేకపోయింది. సుమారు 10 గంటల సమయంలో నాగమ్మ మరణించింది. అయితే, నైట్ డ్యూటీ డాక్టర్ ఆస్పత్రిలో లేకపోవడం, సకాలంలో మెరుగైన వైద్యసేవలు అందకపోవడం వల్లే నాగమ్మ మరణించిందంటూ ఆమె బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. కొందరు వైద్యులపై దాడికి పాల్పడడంతో ఉద్రిక్తత నెలకుంది. సమాచారం అందుకున్న పట్టణ ఎస్ఐ నర్సింహమూర్తి, భాస్కరరావు ఆస్పత్రికి చేరుకుని పరిస్థితిని సద్దుమనిగించారు. ఆస్పత్రికి తీసుకొచ్చేసరికే ఆమె పరిస్థితి బాగులేదని, వైద్యపరీక్షలు చేసి మెరుగైన వైద్యం కోసం విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్‌ను సిద్ధం చేసే సమయంలో ఆమె చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. వైద్యులు ఎప్పుడూ ప్రాణం నిలిపేందుకే చూస్తారని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ గోపాలరావు తెలిపారు. విధుల్లో ఉన్న వైద్యులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఆస్పత్రి సూపరింటెండెంట్ రత్నకుమారి ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

ఆదాయ వనరులు పెంచుకోవాలి

నరసన్నపేట: ఉపాధి వేతనదారులు ఆదాయ వనరులను పెంచుకున్నప్పుడే కుటుంబ ఆర్థిక వ్యవస్థ బాగుంటుందని ఎన్‌ఆర్‌ఈజీఎస్ సహాయ కమిషనర్ (విజయవాడ) అశోక్ అన్నారు. బుధవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన తామరాపల్లిలో ఉపాధి వేతనదారులతో మాట్లాడారు. రోజువారీ వేతనం, పని గంటలపై ఆరా తీశారు. సొంత పొలాలు ఉంటే వాటిలో పండ్ల తోటలు పెంచుకుంటే ఉపాధి పథకాన్ని అనుసంధానం చేస్తామని చెప్పారు. వాటి ద్వారా కూడా ఆదాయం పెంచుకోవచ్చన్నారు. భూములు ఉన్న రైతులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజు, నరసన్నపేట ఏపీఎం యుగంధర్, ఈసీ అప్పలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ముచ్చ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్ వాడకం తగ్గించాలి

గార: చేపలు, రొయ్యల పెంపకంలో యాంటీ బయాటిక్స్ వాడకం తగ్గించాలని జిల్లా మత్స్యశాఖ జేడీ పి.వి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం గార మండలం శ్రీకూర్మం పంచాయతీలో చేపలు, రొయ్యల పెంపకందారులకు కేంద్రప్రభుత్వ సంస్థ నాస్కా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాక్టీరియా, వైరస్, శిలీంధ్రాలు, పరాన్నజీవులు కాలక్రమేణా మారినప్పుడు, మందులకు ప్రతిస్పందించనప్పుడు అంటువ్యాధులను నివారించడం కష్టతరమవుతుందన్నారు. వ్యాధి వ్యాప్తి తీవ్రమై మరణాల రేటు పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో యాంటిబయాటిక్స్ విస్తృతంగా ఉపయోగిస్తే మరిన్ని సమస్యలు ఏర్పడతాయన్నారు. మెరుగైన నీటి నాణ్యత వంటి ఆక్వాకల్చర్ పద్ధతులను అమలు చేయడం వ్యాధి నియంత్రణ చేపట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నాక్సా ఆర్‌సీవో ఎన్‌పీ చంద్రశేఖర్, ఏఎంఆర్ డాక్టర్ సీహెచ్.బాలకృష్ణ, డాక్టర్ షణ్ముఖ, ఎస్.బాలాజీ, గొర సురేష్, పి.రాము తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పీజీ సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం కేంద్రంగా వర్సిటీ, అఫిలియేషన్ పోస్టు గ్రాడ్యుయేషన్ మూడో సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయని ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. డిసెంబర్ 8 వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. సైన్స్ కోర్సుల నుంచి 375, ఆర్ట్సు కోర్సుల నుంచి 143 మంది హాజరు కానున్నారని తెలిపారు.

9న జాతీయ లోక్ అదాలత్

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిసెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనంత ఎక్కువగా క్రిమినల్ కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల సమయం, ఖర్చులు ఆదా అవుతాయన్నారు. పోలీస్ స్టేషన్లకు, కోర్టులకు కూడా పని భారం తగ్గుతుందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు న్యాయమూర్తులు శ్రీదేవి, మహేంద్ర ఫణి కుమార్, భాస్కరరావు, అడిషనల్ సీనియర్ న్యాయమూర్తి అనురాధ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ ఎస్పీ తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీ

కాశీబుగ్గ: పలాస మండలం తర్లాకోటలోని స్టోన్‌క్రషర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. మెళియాపుట్టి మండలం కరజాడ గ్రామానికి చెందిన చాపర దేవరాజు తన తండ్రి బాలరాజుతో కలిసి పలాస నుంచి వస్తుండగా ఒడిశా గారబంద సమీప గ్రామానికి చెందిన ప్రేమ్ కుమార్, నవీన్‌లు ద్విచక్ర వాహనంపై వస్తూ బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో దేవరాజు కుడికాలు, ప్రేమ్‌కుమార్ కుడికాలికి తీవ్ర గాయాలయ్యాయి. వజ్రపుకొత్తూరు మండల 108 అంబులెన్సు ఈఎంటీ అవుగాన నారాయణరావు, పైలట్ దుక్క రాజేష్‌లు ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

నందిగాం/వజ్రపుకొత్తూరు : పూండి – నౌపడ రైల్వేస్టేషన్ల మధ్య రౌతుపురం పాసింజర్ హాల్టు సమీపంలో భువనేశ్వర్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ఢీకొని రైలు ఢీకొని బుధవారం గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. మృతురాలి సుమారు 45 ఏళ్ల వయసు కలిగి ఆకుపచ్చ దుస్తులు ధరించి ఉందని, ఆమె వద్ద ఉన్న ఆనవాళ్లు బట్టి పరిసర ప్రాంతాలకు చెందిన మహిళ అయి ఉంటుందని చెప్పారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, వివరాలు తెలిసిన వారు 9440627567 నంబరుకు సంప్రదించాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పుర్రెకో బుద్ధి.. జిహ్వకో రుచి.. అన్నారు పెద్దలు. దాన్ని నిజం చేస్తూ కాలం మారుతున్న క్రమంలోనే మనుషుల అలవాట్లు.. రుచులు, అభిరుచులు మారుతున్నాయి. ఎప్పుడూ తిన్నవే తింటే నాలుక చచ్చిపోతుంది అని చాలా మంది అంటుంటారు. అందుకే నగరవాసులు సంప్రదాయ ఆహార పదార్థాలను పక్కన పెట్టి కొత్త కొత్త రుచులను ఆహ్వానిస్తున్నారు.. ఆస్వాదిస్తున్నారు. మారుతున్న ప్రజల అభిరుచలను పసిగట్టి కొత్త పదార్థాలను అందుబాటులోకి తెచ్చి వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటున్నారు నిర్వాహకులు. బుర్రకు పదును పెట్టి.. వ్యాపారానికి సృజనాత్మకత జోడిస్తున్నారు. దాని ఫలితమే.. గాడిద, ఒంటె, మేక పాలతో ఐస్ క్రీముల సృష్టి. ఆవు, గేదె పాలతో చేసిన పదార్థాలనే ఇప్పటివరకు రుచి చూస్తున్న ప్రజలకు.. ఈ నయా హిమ క్రీములు తెగ నచ్చేస్తున్నాయి. చలి కాలంలోనూ హాట్ హాట్ అమ్మకాలే దీనికి నిదర్శనం.

వెరైటీ హిమక్రీములు..
హాట్ హాట్ అమ్మకాలు!



- గాడిద, ఒంటె, మేకపాలతో మార్కెట్‌లోకి ఐస్‌క్రీమ్‌లు
- బెల్లం, సుగర్ లెస్ ఐస్‌క్రీమ్‌లకు యమ డిమాండ్
- భలే రుచిగా ఉన్నాయంటున్న శ్రీకాకుళం నగర వాసులు
- కొత్త ట్రెండ్‌ను స్వాగతిస్తున్నారంటున్న అమ్మకందారులు

శ్రీకాకుళం డెస్క్:

గంగి గోవు పాలు గరిటెడైనను చాలు..
కడవడైననేమి ఖరము పాలు..
ఇది నాటి వేమన మాట..
మరి నేడు..

గంగిగోవు పాలతో ఖరము పాలు పోటీ పడుతున్నాయి. ఆరోగ్యం, రోగాలు నయం చేసే ప్రక్రియల్లో వినియోగం.. ఇతరత్రా కారణాలతో గోవుపాల కంటే కూడా గాడిద పాలకే గిరాకీ ఎక్కువైంది. మరో అడుగు ముందుకేస్తే ఆర్గానిక్ పేరుతో జరుగుతున్న వ్యాపారాల్లో గాడిద పాలతో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లను వయసుతో సంబంధం లేకుండా ఆస్వాదిస్తున్నారు శ్రీకాకుళం నగరవాసులు. ఒక్క గాడిద పాలేం ఖర్మా.. ఒంటె పాలు.. మేక పాలతో తయారు చేసిన హిమ క్రీముల రుచులకు ఫిదా అంటున్నారు జనం.

హిమక్రీము రోజురోజుకూ రూపం మార్చుకుంటోంది. చాలా పదార్థాలను తనలో ఇముడ్చుకుని సరికొత్త రుచులతో ఫుడ్ లవర్స్ నోట్లో కరిగిపోతోంది. ఆర్గానిక్ పేరుతో అద్భుతమైన రుచుల సంగమంతో పార్లర్లలో ఐస్‌క్రీమ్‌ను సర్వ్ చేసి శభాష్ అనిపించుకుంటున్నారు అమ్మకందారులు.

ఆర్గానిక్ ఐస్‌క్రీమ్‌లు..

వ్యవసాయ ఉత్పత్తులు మాదిరిగానే ఐస్‌క్రీమ్‌లకు ఆర్గానిక్ ట్యాగ్ వచ్చేసింది. ఐస్‌క్రీమ్ తయారీలో దేశీయ ఆవుపాలు (ఏ2 మిల్క్), ఆర్గానిక్ బట్టర్, పటిక బెల్లం, ఆర్గానిక్ విధానంలో పండించిన పళ్లు, గోంధు చెట్టు గమ్ము, సోయాను వినియోగించి తయారు చేసిన ఆర్గానిక్ కలర్స్‌ను వినియోగించి ఐస్‌క్రీమ్‌లను తయారు చేస్తున్నా కస్టమర్ ఆరోగ్య పరిరక్షణే తమ ధ్యేయమని చెబుతున్నారు అమ్మకందారులు.

సీజన్‌తో పనిలేకుండా..

సీతాఫలం, పనస, పైనాపిల్, ద్రాక్ష వంటి సీజనల్ పండ్ల రుచులు ఆస్వాదించాలంటే మా పార్లర్లకు రమ్మని ఆహ్వానిస్తున్నారు నిర్వాహకులు. సీజన్‌తో సంబంధం లేకుండా ఫ్రూట్ పేరు చెబితే చాలు చక్కనైన చిక్కనైన ఐస్‌క్రీమ్‌ను మనముందు ఉంచుతున్నారు. అంతేనా నచ్చిన నట్స్‌ను కూడా యాడ్ చేసి జిహ్వ చాపల్యాన్ని తీరుస్తున్నారు. వాటి రుచిని ఆస్వాదిస్తే అచ్చం ఆ పండు తిన్న ఫీలింగే కలుగుతుంది.

● డాంకీ ఐస్ క్రీమ్ ధరే ఎక్కువ..



కంట్రీమిల్క్ ఐస్ క్రీమ్‌ల పేరుతో వివిధ జంతువుల పాలతో ఐస్‌క్రీమ్‌లను తయారు చేస్తున్నారు. అందులో ఒంటె, గాడిద, మేక పాలతో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లకు డిమాండ్ బాగా ఉందని చెబుతున్నారు. విభిన్నమైన రుచి వీటి సొంతం కావడంతో ఆస్వాదించేందుకు మొగ్గు చూపుతున్నారు నగరవాసులు. అంతేకాకుండా గాడిద, ఒంటె, మేక పాలల్లో ఔషధగుణాలు ఉండడం కూడా వీటి ఆదరణకు ఓ కారణమని చెబుతున్నారు నిర్వాహకులు. అయితే ఒంటె, మేక పాలతో తయారైన ఐస్‌క్రీమ్‌ల ధరలు రూ.150కి అటు ఇటూ ఉన్నప్పటికీ గాడిద పాలతో తయారు చేసిన 125 మిల్లీలీటర్ల ఐస్ క్రీమ్ ధర మాత్రం అక్షరాలా రూ.450 ఉంది.

విభిన్నంగా ఉండాలని..



నగర వాసులకు వెరైటీగా అందించాలనే ఉద్దేశంతో పార్లర్‌ను స్టార్ట్ చేశా. వివిధ రకాల జంతువుల పాలతో తయారు చేసిన ఐస్‌క్రీమ్‌లకు డిమాండ్ బాగానే ఉంది. ఆర్గానిక్ ఐస్‌క్రీమ్‌లను నగరవాసులు బాగా ఇష్టపడుతున్నారు.

– బి.వికాస్, ఐస్‌బర్గ్ పార్లర్ నిర్వాహకుడు

డిఫరెంట్ టేస్ట్..

నగరంలో ఐస్‌క్రీమ్ పార్లర్లు విభిన్న రుచుల్ని అందిస్తున్నాయి. కంట్రీ మిల్క్‌తో చేసిన ఐస్‌క్రీమ్‌లు, ఆర్గానిక్ ఫ్లేవర్స్ ఆస్వాదిస్తుంటే చాలా బాగున్నాయి. –సందీప్

సుగర్ ఫ్రీ.. బెల్లంతో మజా..

మధుమేహ వ్యాధిగ్రస్తులు, సుగర్ వినియోగానికి దూరంగా ఉండే వారి కోసం సుగర్ ఫ్రీ, సుగర్ లెస్ ఐస్‌క్రీమ్‌లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. అలాగే బెల్లంతో తయారైన ఐస్‌క్రీమ్‌లకు గిరాకీ బాగానే ఉందని చెబుతున్నారు దీపామహల్ రోడ్‌లోని ఐస్‌బర్గ్ పార్లర్ నిర్వాహకులు వికాస్. బెల్లం, సుగర్ లెస్ ఐస్‌క్రీమ్‌లలో 32 ఫ్లేవర్స్ తమ వద్ద లభ్యమవుతున్నాయని చెప్పారు. వీటి ధరలు రూ.59 నుంచి రూ.99 వరకు ఉన్నాయి.



'థాలీ' భుజించేద్దాం...



థాలీ పేరు వినే ఉంటారు. పెద్ద హోటళ్లలో చక్కనైన భోజనాన్ని థాలీ అని పిలుస్తారు. 10 రకాల చిన్న చిన్న గిన్నెల్లో విభిన్న రకాల కూరలు.. పాయసం.. పప్పు.. రసం ఇలా అన్ని కలిపి పెద్ద పళ్లెంలో భోజనాన్ని వడ్డిస్తారు. దాని మాదిరిగానే ఐస్‌క్రీమ్ పార్లర్లలో కూడా ఐస్‌క్రీమ్ థాలీని వడ్డిస్తున్నారు. ఇందులో ఎనిమిది రకాల ఫ్లేవర్స్ కూడిన హిమక్రీములను పళ్లెంలో అందిస్తున్నారు. ముగ్గురికి సరిపోతుందని చెబుతున్నారు అమ్మకందారులు. దీనికి రూ.399 వరకు చార్జీ చేస్తున్నారు. ఇందులో బేసిక్ ఫ్లేవర్స్‌తో పాటు నట్స్‌ను యాడ్ చేసి ఐస్‌క్రీములు కూడా ఉన్నాయి.

పైడి భీమవరంలో
ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్

- రూ.14.60 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం
- వర్చువల్ పద్ధతిలో ప్రారంభించిన సీఎం జగన్
- పరిశ్రమల ఏర్పాటుకు సంపూర్ణ సహకారం: కలెక్టర్



వర్చువల్ విధానంలో ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ ఆధ్వర్యంలో పైడిభీమవరంలో రూ.14.60 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి బుధవారం వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ మందిరంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఒక్కరోజే రూ.1,072 కోట్లతో రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. వీటి ద్వారా 22 వేల మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు.

● కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ రెండెకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కాంప్లెక్స్‌లో వివిధ రకాల పరిశ్రమలను నెలకొల్పేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వపరంగా అన్ని సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఇప్పటికే రోడ్లు, విద్యుత్, ప్రహరీ, మంచినీటి సదుపాయం కల్పించామని చెప్పారు. రానున్న రెండేళ్లలో 1500 మందికి ఇక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రూ.30 కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నామని తెలిపారు. మూలపేట పోర్టు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే పారిశ్రామికంగా జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా పరిశ్రమలశాఖ జీఎం ఉమామహేశ్వర రావు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ బి.హరిధరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగిని ఆత్మహత్య

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని పీఎస్‌కాలనీలో నివాసముంటున్న ఓ బ్యాంకు ఉద్యోగిని ఎలుకల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్‌ఐ కె.లక్ష్మి తెలిపిన వివరాల మేరకు.. పీఎస్‌కాలనీ మొదటి లైన్‌లో సాయిసత్య అపార్ట్‌మెంట్‌లో ఉరిటి సరళ తన భర్త గోవిందరావు చనిపోవడంతో కుమారుడు కిరణ్‌బాబు, కుమార్తె స్వప్నప్రియ (39)లతో కలిసి నివాసముంటున్నారు. కిరణ్‌బాబు శ్రీకాకుళం ఎస్బీఐ రీజియన్‌లో పనిచేస్తుండగా, స్వప్నప్రియ గార మండలం స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచి ఆఫీసులో డిప్యూటీ మేనేజరు/అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. వీరి స్వగ్రామం నరసన్నపేట సమీపంలోని యారబాడు. స్వప్నప్రియకు 2010లో శ్రీకాకుళానికి చెందిన కుప్పలి ప్రదీప్‌కుమార్‌తో వివాహం జరిగినా అభిప్రాయ భేదాలు రావడంతో 2019లో ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి తాను ఒంటరినే బాధతో ఉండేవారు.

తనఖా బంగారం మాయమవ్వడంతో..

గార ఎస్‌బీఐలో ఖాతాదారులు తనఖా పెట్టిన రూ.3 కోట్ల బంగారం మాయమైందని, దీని వెనుక డిప్యూటీ మేనేజర్/అకౌంటెంట్‌గా ఉన్న ఓ మహిళా ఉద్యోగిని, ఆమె సోదరుడి హస్తముందని కొన్ని పత్రికల్లో(సాక్షి కాదు) నాలుగైదు రోజులుగా వరుస కథనాలు వస్తున్నాయి. ఖాతాదారులు బ్యాంకు వద్ద ఆందోళనకు దిగడం, చివరకు బుధవారం గార సీఐ కామేశ్వరరావు సమక్షంలో రీజనల్ మేనేజర్ ఖాతాదారులకు బంగారం ఇప్పించే బాధ్యత తనదని సర్దిచెప్పి వెళ్లిపోయారు.

ఆ కథనాలతో మనస్తాపం చెంది..

పత్రికల్లో వస్తున్న కథనాలు తన గురించే అని ఇంటి వద్ద తల్లితో చెప్పి స్వప్నప్రియ తీవ్రంగా మనోవేదన చెందేదని, సోషల్ మీడియాలో కూడా కావాలనే తనపై తప్పుడుగా ప్రచారం చేస్తున్నారని స్వప్నప్రియ వాపోయేది. ఈ క్రమంలో ఈ నెల 24న బయటకు వెళ్లి వచ్చిన స్వప్నప్రియ వాంతులు చేయడంతో తల్లి ఆందోళన చెందింది. ఏమైందని అడగ్గా.. తన బతుకు ఇలా అయిపోయిందని ఏడుస్తూ పడుకుంది. మరుసటి రోజు నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చి ఎలుకల మందు తాగానని తల్లితో చెప్పింది. అప్పటి నుంచి మందులు వాడుతున్నా వాంతులు తగ్గలేదు. ఈ నెల 28న ఓ ప్రధాన పత్రికలో వచ్చిన ఎస్బీఐ ఆర్‌ఎం వివరణ మంచిగా ఇచ్చారు.. బాగుంది అని కూడా తన తల్లితో చెప్పింది. అయినప్పటికీ ఆరోగ్యం రోజురోజుకీ క్షీణిస్తుండటంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా బుధవారం ఉదయం మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అంత్యక్రియల కోసం మృతదేహాన్ని స్వప్నప్రియ స్వగ్రామం తరలించనున్నట్లు ఎస్‌ఐ లక్ష్మి చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అపరిచిత వ్యక్తులపై నిఘా

- ప్రాపర్టీ కేసులను నియంత్రించాలి
- నేరసమీక్షలో ఎస్పీ రాధిక



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతిపోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్ నిర్వహించి కొత్తవ్యక్తులపై నిఘా ఉంచాలని ఎస్పీ జి.ఆర్.రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అక్టోబరుకు సంబంధించిన కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాపర్టీ నేరాల నివారణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, ఇందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో అందే ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని, రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడుతున్నప్పటికీ వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి సత్ప్రవర్తనతో నడుచుకునేలా చూడాలన్నారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి స్వయంగా గస్తీలు నిర్వహిస్తూ నేరాలు జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు టి.పి.విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు జి.బాలచంద్రరెడ్డి, డి.నాగేశ్వరరెడ్డి, విజయ్ కుమార్, ఎస్.వాసుదేవ్, జి.వి.ప్రసాద్, ట్రైనీ డీఎస్పీ సీహెచ్ రాజా, ఏవో పరిపాలనాధికారి సీహెచ్ గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ విద్యకు ప్రోత్సాహం

- పాఠశాలతో పాటు జూనియర్ కళాశాలలకూ క్రీడా పరికరాలు
- స్థాయిని బట్టి 17 రకాల కిట్లు అందజేత
- ఇప్పటికే 2688 స్కూళ్లకు పంపిణీ



ఉన్నత పాఠశాలలకు పంపిణీ చేసిన క్రీడా పరికరాలు

నరసన్నపేట : నాడు–నేడు కార్యక్రమంతో ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పాఠశాలల్లో క్రీడలకు, వ్యాయామ విద్యపై దృష్టి సారించింది. ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను బలోపేతం చేస్తూ స్కూల్ కాంప్లెక్స్‌ల్లో పీడీలు, పీఈటీలకు భాగస్వామ్యం చేసింది. దీనిలో భాగంగా అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు క్రీడా సామగ్రిని సరఫరా చేయడంతో అటు విద్యార్థులు, ఇటు పీడీలు, పీఈటీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో క్రీడలను అస్సలు పట్టించుకునేవారు కాదు. దీంతో విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి తగ్గింది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత క్రీడలకు ప్రాధాన్యత బాగా పెరిగింది. గ్రామీణులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంచి వారిలో క్రీడా నైపుణ్యం వెలికి తీసేందుకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తూ వస్తోంది. తాజాగా నాణ్యమైన క్రీడా పరికరాలు పంపిణీ చేసి అండగా నిలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా 1936 ప్రాథమిక, 302 ప్రాథమికోన్నత, 378 ఉన్నత పాఠశాలలకూ, 72 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కలిపి మొత్తం 2688 పాఠశాలలు, కళాశాలలకు పరికరాలు పంపిణీ చేసింది.

ప్రాథమిక పాఠశాలలకు:

ఉడెన్ క్రికెట్ బ్యాట్, వికెట్స్ సెట్, టెన్నిస్ బాల్, హ్యాండ్‌బ్యాల్, ఫ్రిస్బీ మల్టీకలర్ హాలా హూప్స్, స్టెప్ హార్డిల్స్, స్కిప్పింగ్ రోప్‌లు పంపిణీ చేశారు.

ప్రాథమికోన్నత పాఠశాలలకు:

వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్, బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్ రింగ్, టెన్నికాయిట్ నెట్, స్కిప్పింగ్ రోప్స్, చెస్ సెట్, వేయింగ్ మిషన్, షాట్‌ఫుట్, డిస్కస్ రబ్బర్, కోన్స్ మార్కింగ్, స్టెప్ హార్డిస్, ఫ్రిస్బీ పరికరాలను సరఫరా చేశారు.

ఉన్నత పాఠశాలలు జూనియర్ కాలేజీలకు:

వాలీబాల్స్, నెట్, త్రోబాల్, నెట్, హ్యాండ్‌బాల్స్, టెన్నికాయిట్స్, నెట్, స్కిప్పింగ్ రోప్స్, యోగా మ్యాట్స్, చెస్ సెట్ ఫుట్ ఎయిర్ పంప్, ఫుట్‌బాల్, వేయింగ్ మిషన్, షాట్‌పుట్, డిస్కస్ త్రో మెజరింగ్ టేప్, యోగా మ్యాప్, ఫుట్ పంపులను సరఫరా చేశారు. ఈ రికరాల కోసం ఒక్కో ప్రాథమిక పాఠశాలకు రూ.3,400, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.7,800, ఉన్నత పాఠశాలకు జూనియర్ కళాశాలలకు రూ.17,700 ప్రభుత్వం ఖర్చు చేసింది.



ఉర్లాం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో క్రీడాపరికరాలు చూస్తున్న విద్యార్థులు

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు..

ఇప్పటి వరకూ సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులకు పాఠ్యప్రణాళికపై స్కూల్ కాంప్లెక్స్ నిర్వహిస్తున్నారు. ఇప్పుడు పీడీ, పీఈటీలకూ నియోజకవర్గ స్థాయిలో స్కూల్స్ కాంప్లెక్స్‌లు నిర్వహిస్తున్నారు. చదువుతో పాటు క్రీడలనూ విద్యార్థులకు చేరువ చేసేందుకు తద్వారా మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు చర్యలు చేపడుతున్నారు. సహ పాఠ్య ప్రణాళికను రూపొందించేలా పీడీలు, పీఈటీలకు బాధ్యతలను అప్పగించారు. నెలవారీగా ప్రణాళికలు తయారు చేయించి అమలు చేయిస్తున్నారు.

ఇదే మొదటిసారి..



నేను పీఈటీగా, పీడీగా 15 ఏళ్ల నుంచి నుంచి పనిచేస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వమూ ఇన్ని క్రీడా పరికరాలు ఇంత నాణ్యతగా ఇవ్వలేదు. వీటి వల్ల విద్యార్థుల్లో క్రీడా సామర్థ్యం, ఆసక్తి పెరుగుతుంది. అన్ని పాఠశాలలకు క్రీడా పరికరాలు పంపిణీ చేయాలనే ప్రభుత్వ నిర్ణయం భేష్.

– రెడ్డి రవి, పీడీ, మాకివలస ఉన్నత పాఠశాల

నాణ్యతగా ఉన్నాయి..



ప్రభుత్వం సరఫరా చేసిన క్రీడా పరికరాలు నాణ్యతగా ఉన్నాయి. ఇక నుంచి ప్రతి ఏటా ఈ విధంగా పంపిణీ చేయాలి. వ్యాయామ విద్య పట్ల ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం అభినందనీయం. మేం కూడా మా వంతు ప్రయత్నం చేసి ప్రభుత్వ ఉద్దేశాన్ని అమలు చేస్తాం.

– జ్యోతీరాణి, పీడీ, ఉర్లాం ఉన్నత పాఠశాల

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు ఇద్దరు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అర్జున్

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక సీనియర్ నేషనల్స్ బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి కె.జయకృష్ణ, ఎండీ హాఫీజా ఎంపికయ్యారు. పంజాబ్‌లోని లూథియానా వేదికగా డిసెంబర్ 3 నుంచి 10 వరకు ఆలిండియా సీనియర్స్ పురుషులు, మహిళల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్–2023 పోటీలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ జట్లకు వీరిద్దరు ప్రాతినిధ్యం వహించనున్నారు. నవంబర్ 22 నుంచి 29వరకు చిత్తూరు వేదికగా జరిగిన శిక్షణా శిబిరాల్లో మెరుగ్గా రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి, డీఎస్‌ఏ కోచ్ గాలి అర్జున్‌రావురెడ్డి తెలిపారు. జయకృష్ణ ఎల్‌ఎన్‌పేట సచివాలయం సర్వేయర్‌గా, ఎండీ హాఫీజ శ్రీకాకుళం దిశా పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వీరి ఎంపిక పట్ల ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్‌రావు, బాస్కెట్‌బాల్ సంఘ ప్రతినిధులు, పీఈటీ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.